100

# చీకటి మింగిన వేకువ

స్వాతంత్ర్యానికి రజతోత్సవాల యీడు దాటిపోయింది. సామాన్యుడి జీవన వ్యయం ప్లాటినం రేటుతో పోటీ పడుతోంది. సగటు మనిషి జీవిత ప్రమాణం సగానికి సగం దిగజారుతోంది.

వేతన పక్షులు వెర్రిగా వీధుల్లో అరుస్తూనే వున్నాయి. ఒకటో, అరో, జీతపురాళ్ళు పెరుగుతూనే వున్నాయి. ధరలు మాత్రం హనుమంతుడి వాలంలా అంతకు మరింతగా పెరిగిపోతూనే వున్నాయి.

కష్ట జీవుల కడుపు మంట కాష్టంలా మండుతోంది. దాన్ని ఆర్పటానికి సమ్మెలూ సత్యాగ్రహాలూ సాగటం లేదు. అసలు వాళ్ల గురించి ఎవరూ పట్టించుకోరు (ఓట్లప్పుడు రాజకీయులు తప్ప) వాళ్ల కష్టాలు కన్నీళ్లు వాళ్లవే! వాళ్ళ శ్రమా దాని ఫలితమూ మాత్రం అందరిదీను. వాళ్ల నెత్తురు, చెమట, కన్నీళ్ళు- కల్సి ఘనీభవించి ద్రవ్యం అవుతోంది. అది ప్రణాళికల పంపుల్లోంచి, ప్రాజెక్టులూ, పంచాయితీ సంస్థల పక్క కాలువల్లోకి పారుతోంది. అక్కణ్నుంచి -కాంట్రాక్టర్లకూ, కమీషన్ వుద్యోగులకూ చేజిక్కి, ఆదాయపు పన్నుకు అందని అఘాతాల్లోకి ఇంకిపోతోంది. ప్రాజెక్టులు నిధుల్లేక నిల్చిపోతున్నాయి. కాంట్రాక్టర్ల,ఇంజనీర్ల ఇళ్ల మీద ఇళ్లు మొలుస్తున్నాయి.

ఉత్పత్తి వున్నా ద్రవ్యోల్బణం మిన్నంటే పెనురక్కసిలా పేదవాడి పీకలు నులుముతోంది.

పంచాయితీ సంస్థల్లో పంతుళ్ళ జీతాలు ఆరు మాసాలకి ఒక్క మారైనా అందవు. వారానికి మూడు రోజులైనా వాళ్ళ పొయ్యిల్లోంచి పిల్లులు లేవవు.

ఇదీ నేటి సాంఘిక న్యాయం.

సామాన్యుడికి జరుగుతోన్న అన్యాయం.

కలవాడు లేనివాడ్ని కాల్చుకుతింటూనే వున్నాడు. లేనివాడు 'కర్మ'ని తిట్టుకుంటూ

లేమితో కుళ్ళిపోతూనే వున్నాడు.

ఇవి రెండూ నేటి సమాజం అనే నాణానికి బొమ్మ-బొరుసు. అది చెల్లకూడని నాణెమే! అయినా చెలామణిలో వున్న నాణెం!!

ప్రజాస్వామ్యపు ఎన్నికల 'టాస్'లో శకుని పాచికలా అదెప్పుడూ బొమ్మే చూపుతుంది. బొరుసెప్పుడూ తిరగబడదు.

శేర్ బదరీనాథ్ కాంట్రాక్టర్-కం-బడా బిజినెస్ మేన్.

అన్ని వ్యాపారాల్లోనూ వారికి ప్రవేశం వుంది. అన్ని వ్యాపార సంస్థల్లోనూ వారికి వాటాలున్నాయి. అసలు వారే ఒక పెద్ద సంస్థ. తక్కిన వ్యాపారులంతా వారికి అంతేవాసులు.

తక్కువ పెట్టుబడితో ఎక్కువ లాభాల్ని ఎలా ఆర్జించాలి అనేది వారికి వెన్నతో పెట్టిన విద్య. అందుకు సంబంధించిన కిటుకులన్నీ వారికి కరతలామలకం.

అందుకే....

వారు వ్యాపారుల సంఘానికి అధ్యక్షులు.

ఆ మహానగరంలో శేర్‌బదరీనాథ్ కున్న అనేక భవంతుల్లో అదొకటి.

ఆ భవంతి చుట్టూ విశాలమైన ప్రాంగణం వుంది. దాని చుట్టూ ఎత్తయిన ప్రహరీ వుంది. ఆ ప్రాకారాన్ని ఆనుకుని ప్రాంగణంలో అనేక రేకుల షెడ్డులున్నాయి. ఆ భవంతిలోనూ, ఆ షెడ్డుల్లోనూ; సమాజంలోని అన్ని తరగతుల మనుషులూ వారివారి తాహతుల్ని బట్టి అద్దెకుంటున్నారు. సమాజంలోని అన్ని వర్గాల నించీ శేర్ అద్దెలు వసూలు చేస్తున్నాడు. వాళ్ళందరికీ అన్నిటికీ శేర్ గారి దుకాణాల్లో ఖాతాలున్నాయి.

శేర్ గారి అద్దెల భవంతికి ఎదురుగా పెద్ద ఖాళీ స్థలం వుంది. అక్కడ "బావూజీ హట్స్ యూనియన్" అని బోర్డు వుంది. ఆ స్థలంలో వందకుపైగా గుడిసెలున్నాయి. ఆ గుడిసెల్లో నేలబారు రిక్షావాళ్ళున్నారు. వాళ్ళు తొక్కే రిక్షాలన్నీ శేర్‌గారివే!

ఆ గుడిసెల్లో ఎప్పుడూ,ఎవరూ ఎక్కువ కాలం వుండరు. వుండకూడదు. ఉండాలంటే మాత్రం శేర్‌జీకి వెయ్యి రూపాయలకి ప్రోనోట్ రాయాలి.

గాలి, వాన, వరద- ఏం వచ్చినా ప్రభుత్వంనుంచి గుడిసెలకు పైకం వస్తుంది. అది శేర్‌గారి ఇనప్పెట్లోకే నేరుగా వెళ్లిపోతుంది.

* * *

ఆ నెల శేర్ గారి బియ్యం దుకాణంలో స్టాకు అలానే వుండి పోయింది. కసిగా ఆలోచించేడు శేర్. కషాయంలా తట్టింది కారణం.

-తన కొట్లో అరువు చిక్కినా ధర అధికం.

-చౌక డిపోలో రొఖ్ఖమే అయినా ధర ఖచ్చితం.

శేర్ గారి వ్యాపార మేధస్సు పాదరసంలా పనిచేసింది. అదెప్పుడూ అలా పని చేస్తూనే వుంటుంది.

ఆ సాయంత్రం వర్తకుల సర్వసభ్య సమావేశం జరిగింది. 'తలో ఐదువేలూ' అన్నాడు శేర్. తలలు వూగాయి తప్ప తర్జన భర్జనల్లేవు.

* * *

మంత్రిగారి నివాసంలో సందర్శకుల గది.

అది వింత వింత మనుషుల్తో కిటకిటలాడుతోంది.

అక్కడ-

నాయకులున్నారు, వినాయకులున్నారు, ఉద్యోగులున్నారు, నిరుద్యోగులున్నారు. అందరికీ, అన్ని సమస్యలకీ అందమైన మండలి అది. అంతా, ఆ రోజంతా మంత్రిగారి దర్శనం కోసం వేచివున్నవారే...

వేచి వుండక్కర్లేకుండగానె దర్శనం దొరికింది శేర్‌జీకి. టిక్కెట్టు కొనుక్కొంటే దైవదర్శనం దొరికినట్టు!

అనేక అల్పజీవుల్ని మేసి తెగబలిసిన మహాజీవి కాయం శేర్‌జీది. దాన్ని మెల్లగా, ఆయాసంగా, ఈడ్చుకెళ్ళి మంత్రిగారి శీతల గదిలో ఆయనకి ఎదురుగా కూలేశాడు.

మంత్రిగారి కళ్ళు శేర్ గారి కళ్ళల్లోకి చూశాయి. సూర్యుడ్ని సైతం మబ్బుపర్చగల తీక్షణత దర్శించారు ఆనేత్రాల్లో. అనేక సూర్యుల్నిసైతం ఆర్పగల చల్లదనం చూపించక తప్పలేదు అమాత్యుల వారికి.

మంత్రిగారి ముఖం ఎప్పుడూ వికసించని పుష్పం వికసించినట్లు హసించింది. మరెప్పుడూ వాడని పుష్పంలా వికసించింది శేర్‌గారి ముఖం. వారి మనోభావాల్ని వాచికంగానే ప్రకటించుకున్నారు.

కాలింగ్ బెల్ మోగింది.

ఫోన్లు పలికాయి.

అంతరంగిక కార్యదర్శి వచ్చేడు, పోయేడు.

అంతే...

జి.వోలు మారేయి. జీవుల బతుకులు మారేయి.

* * *

సుబ్బారావు సెక్రటేరియట్‌లో గుమాస్తా.

అతని నివాసం శేర్‌గారి రేకుల షెడ్డులో.

అతనికి సంతానం అయిదు; చిల్లర మనుషుల్తో -వెరసి అతని సంసారం తొమ్మిది.

అతని జీతం ఎంతో అతనెరగడు. అన్ని కోతలూపోను వచ్చినంత వస్తుంది.

అతనికి అప్పులెన్నో అసలే ఎరగడు. వచ్చినంత మంది వస్తారు; ఆ వచ్చింది పంచుకుపోతారు.

మిగిలేది తనే- జీవచ్ఛవం!

అక్కడ-

ఆ కాంపౌండులో వుంటున్న వాళ్లంతా తన సాటివాళ్లే! ఎవరూ తనకంటె ఎక్కువ చదువుకోలేదు. తన కంటె పెద్ద వుద్యోగాలు చెయ్యటం లేదు. అయినా, తనకంటె బాగా బతుకుతున్నారు. మంచి యిళ్లల్లో వుంటున్నారు. మంచి బట్టలు కడ్తున్నారు. పిల్లలు కాన్వెంటుల్లో చదూకొంటున్నారు. పెళ్లాలు నగలూ, నైలెక్సు చీరలూ ధరిస్తున్నారు.

రాజేశ్వర్రావు-

రిజర్వు బేంకులో గుమస్తా. నెలకు ఎనిమిది వందల జీతం.

అప్పల్రాజు-

ఇన్కంటేక్స్‌లో గుమస్తా. ఎంత ఒస్తోందో తెలీదు గాని వెయ్యి రూపాయల జీతగాడిలా మాత్రం వుంటాడు.

రమణమూర్తి-

రోడ్ ట్రాన్స్‌పోర్టు అథారిటీలో గుమస్తా. స్కూటరుంది. అందులోకి పెట్రోలు కూడా అతను కొనక్కర్లేదుట!

ఏమిటీ వ్యత్యాసం!

ఎందుకీ అంతరాలు!!

* * *

సుబ్బారావు ప్రావిడెంట్ ఫండ్‌లో అప్పుతీసుకున్నాడు. అది ఆ నెల బియ్యం మీద

పెట్టాలనుకున్నాడు. తన యింట్లో బియ్యం వాడకం- మిల్లాడినట్లే! అదంతా శేర్ కొట్లో తీసుకుంటే- తనను గానుగాడినట్టే!!

అందుకే-

రేషన్ కార్డు దుమ్ము దులిపి, 'ఫెయిర్ ప్రైస్ షాప్' అని ముద్దుగా పిలవబడే రేషన్ కొట్టుకు బయల్దేరేడు. ప్రజల నిస్సహాయతని లాభంగా నాణెం చేసుకునే ప్రభుత్వం ఏజెంటు -లైసెన్స్‌డ్ ఎక్స్‌ప్లోయిటర్ రేషన్ వాడు. కార్డు అటూ ఇటూ తిప్పి తిరిగి ఇచ్చేశాడు.

"ఏమిటీ?" వెర్రి ప్రశ్నవేశాడు సుబ్బారావు.

"సూపర్‌బజార్... సూపర్‌బజార్" అన్నాడు షాపువాడు బుగ్గనున్న కారా కిళ్లీజారకుండా జాగ్రత్త పడుతూ.

"ఎందుకు?"

"ఇది హయ్యర్ ఇన్కంకార్డు, ఈ కార్డు మీద బియ్యం ఇక్కడ ఇవ్వద్దని సర్కారు ఆజ్ఞ"

తను హయ్యర్ ఇన్కం వాడా? ఎలా? ఆఫీసులో అప్పులిచ్చేటప్పుడు లో ఇన్కం అని కోతపెడతారే?

నవ్వుకున్నాడు సుబ్బారావు.

కాళ్ళీడ్చుకుంటూ సూపర్ బజార్‌కి బయల్దేరాడు. భార్య పొయ్యిమీద ఎసరు పెట్టి వుంటుంది. పిల్లలు ఆకలితో అలమటిస్తో వుంటారు. ముసిలాళ్ళు ముక్కుతూ, మూల్గుతూ మంచంలో పడి వుంటారు. 'క్యూ' చూస్తే పెద్దాపురం చాంతాడులా వుంది. జనం తిరునాళ్ళ కేసిన స్పెషల్ ట్రెయిన్‌లోలా గింజుకుంటున్నారు. ఈ అరిష్టాలన్నిటినీ అధిగమించి కౌంటర్‌కు చేరితే.. సహకార శాఖ వారి అసహకారానికి సూచనగా కార్డు తిరిగి వచ్చింది.

"ఏమయింది?"

"సివిల్ సప్లయి ఆఫీసు కెళ్ళి,సూపర్ బజార్‌కు రిజిష్టర్ చేయించుకోండి."

తిరిగి తన పక్కకౌంటర్లోవున్న అందమైన అమ్మాయితో కబుర్లలో పడిపోయాడు సూపర్ గుమస్తా.

ఆ వాళకి భోజనయోగం లేదు. తిరిగి యింటికి వెళ్ళడం కంటే జుగుప్సాకరమైన పని మరొటి లేదు. అలాగే ఆఫీసుకి వెళ్ళిపోయాడు సుబ్బారావు. సంతకం చేసి, కేంటీన్‌లో అరువు టీ తాగి, పైవాడి దయాదాక్షిణ్యాల మీద బైటపడి, సివిల్ సప్లయి ఆఫీస్‌కు బయల్దేరాడు.

అక్కడ అన్నీ తిమింగలాలే!

ఓడల్ని సైతం మింగేసే పెనుతిమింగలాలు.

మూడు గంటలు క్యూలో నుంచున్నాక కార్డు పుచ్చుకుని మూడు రోజులతర్వాత రమ్మన్నారు.

మూడో రోజున-

ఒక పూట కేజువల్ లీవు, మూడు గంటల నిలువు జీతం.

ఆ తర్వాత తేలిన విషయం-

కొత్త కార్డులు రిజిష్టరు చేసుకోవద్దని ప్రభుత్వంవారి తాఖీదట!

మళ్ళీ- ఆఫీస్, కేజువల్ లీవ్- రివెన్యూ డిపార్టుమెంటులో పైరవీ.

ఈసారి వెళ్ళగానే కార్డు రిజిష్టరయింది.

పరమపద సోపానం...

మళ్ళీ సూపర్ బజార్-క్యూ- కౌంటర్. "పన్నెండు కిలోలు మాత్రమే వస్తాయి" గుమస్తా జవాబు.

"అదేవిటండి! మేం తొమ్మండుగురం. నెలంతా పన్నెండు కిలోలు ఎట్లా సరిపోతయ్?"

"ఆ మాట గవర్నమెంటును అడగండి... మీరు వంద మందైనా అంతే... రూలంటే రూలే...."

"మరెలా?"

"ఎలాగేవిటి? పైసలుంటే బజార్లో బోలెడు పాత బియ్యం"

పన్నెండు కిలోలూ నాలుగు రోజులు తిన్న అప్పులకి సరిపోయేయి.

* * *

నడుస్తోన్న శవంలా శేర్ దగ్గరి కెళ్ళాడు సుబ్బారావు.

"ఎక్కడా దొరక్కపోతే ఇక్కడన్న మాట?" నిష్ఠూరమాడేడు శేర్.

ఏదో గొణిగేడు సుబ్బారావు. వేళ్ళకు రాని మెటికలు విరిచేడు. చేతుల మట్టంతా నలిపేడు.

"నాలుగు నెల్ల అద్దెకట్టాలి. బియ్యం ఏడనుంచొస్తయ్?"

"ఒచ్చే నెల మొత్తం యిచ్చుకుంటా సార్."

"ఒచ్చే నెల, ఒచ్చే నెల... ఎన్నాళ్ళు. ఇప్పటికే నాకు నూరు రూపాయిల మిత్తి నుక్సానయింది."

"సరే వడ్డీ యిస్తుంటారేంటి?"

"ఇవ్వాలి మరి!"

మిగిలిన పైకం వడ్డీగా జమ కట్టాడు.

"మిగిలిందానికి ప్రోనోటు రాయి."

డబ్బులేనివాడికి ఇచ్చేవాడు దొరికితే ప్రాంసరీ నోటే సులువైన రాజమార్గం. నాలుగు నెలల అద్దెతో బాటు బియ్యం ఖరీదు మొత్తం మూడు వందలకి ప్రోనోటు రాసి బైటపడ్డాడు సుబ్బారావు.

శేర్ చేతిలో సుబ్బారావుకి సంకెళ్ళు బిగిసేయి.

* * *

గుడిశెలున్న స్థలం గుడిశెల పరమైంది. ఇక శేర్ పరం కావాలి. అక్కడ ఫైవ్ స్టార్ హోటల్ లేవాలి.

ప్రోనోట్లు బయటికి వచ్చేయి. గుడిశెలు ఎదురు తిరిగేయి. శేర్ భయపెట్టి నోట్లు రాయించుకున్నాడని కార్మిక నాయకుడి వాదన. కాని... సాక్ష్యాలు?

శేర్ గారూ- వారి భవంతిలో అద్దెకుంటున్న వాళ్ళు... వీళ్ళే సాక్షులు, కాని ఎవరూ గుడిశెలవైపు మొగ్గుచూపరు.

సుబ్బారావు-

రేకుల షెడ్డు సుబ్బారావు-

దరిద్రుడు దరిద్రుడికే తోడ్పడగలడని నమ్మే సుబ్బారావు ఒక్కడే శేర్‌కు వ్యతిరేకంగా చెప్పేడు. కాని- ఏం లాభం? గుడిసెలు భవంతితో లాలూచీ పడిపోయాయి.

మరో ఖాళీ స్థలంలో గుడిశెలు వెలిశాయి.

ఆ స్థలంలో హోటలుకు పునాదులు లేచాయి.

సుబ్బారావు ప్రోనోట్ పైకి వచ్చింది.

పద్దులు పాముల్లా బుసలు కొట్టేయి.

సుబ్బారావుని ఇల్లు ఖాళీ చెయ్యమన్నాడు శేర్. డబ్బంతా వున్నఫళంగా కక్కమన్నాడు. కక్కటానికి నెత్తురేలేదు డబ్బెక్కడిది? శేర్ కోర్టుకెళ్ళేడు. పే ఎటాచ్‌మెంటు తెచ్చేడు.

సుబ్బారావు చేతిలో చిల్లిగవ్వ మిగలడం లేదు. వచ్చే జీతం శేర్, కాబూలీ వాడూ పంచుకు పోతున్నారు.

బియ్యం అరువిమ్మన్నాడు శేర్‌ను.

శేర్ తిరస్కరించాడు. అంతేగాదు తూలనాడాడు. అక్కడే వుంటే తన్నాతన్నాడు.

ఎన్నడూ కోపంరాని సుబ్బారావుకు కోపం వచ్చింది.

ఎప్పుడూ తనపైన తనకే కోపం వచ్చే సుబ్బారావుకు, అలసత్వం తప్ప ఆగ్రహం ఎరగని సుబ్బారావుకు కోపం వచ్చింది.

శేర్‌పైకి చేయెత్తేడు.

అంతే....

ఎత్తిన చేయి దించకముందే వచ్చేసింది పోలీసు బలగం. బలహీనుడ్ని కాపాడలేని, బలవంతుడికి మరింత బలం ఇచ్చే పోలీసు బలగం- సుబ్బారావు ఎముకలు విరగ్గొట్టి లాక్కుపోయింది.

సుబ్బారావు సంసారం...

అన్నార్తులు, అల్పజీవులు- అయిన సుబ్బారావు సంసారం. ఆ మర్నాటి ఉదయానికి చచ్చి పడి వుంది.

ఆకలి చావులన్నారు ప్రతిపక్షంవాళ్ళు.

ఆత్మహత్యలన్నారు భవంతిలోవాళ్ళు.

చచ్చినవాళ్ళ మీద ఎవళ్ళకీ సానుభూతి లేదు. అందరి సానుభూతీ శేర్ మీదనే. ఆయన యింట్లో చచ్చి పాపం! ఆయిన్ని బజారు కీడ్చారుట!

పత్రికలు మాత్రం ఇలా తమ విచారాన్ని ప్రకటించాయి.

శేర్‌జీ ఇంట్లో- అనేక మందికి తిండి పెట్టి పోషించే శేర్‌జీ, వంద మంది నిరుపేదలకు రిక్షాలిచ్చి భృతి కల్పిస్తున్న శేర్‌జీ ఎన్నో లక్షల పన్నులు కట్టి దేశానికి ఇతోధికంగా సేవ చేస్తున్న శేర్‌జీ ఇంట్లో ఆకలి చావులా?... ఎంత విచారం!!!

*(స్వాతి, మార్చి 1978)*